## జాతీయ స్థాయి పోటీల్లో వికారాబాద్ వాసి



ఐస్టక్ పోటీల్లో పాల్గొన్న గోపాలకృష్ణ

వికారాబాద్, అక్టోబర్ 12 : మహారాష్ట్రలోని శివ ఛత్రపతి స్టేడియంలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన 2023 జాతీయస్థాయి ఐస్టక్ పోటీలో వికారాబాద్‌వాసికి గుర్తింపు లభించింది. వికారాబాద్ పట్టణం రామయ్య గూడకు చెందిన డి.గోపాలకృష్ణకు గ్రూప్ ప్లే విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. తెలంగాణ రాష్ట్రం తరపున గోపాలకృష్ణ, కోటేశ్వరరావు, శ్రీనివాస్, శివనాగరాజు పోటీల్లో పాల్గొన్నారు. వికారాబాద్‌కు మంచి గుర్తింపు తెచ్చినందుకు గోపాలకృష్ణను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## మైండ్ స్పార్క్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ విద్యార్థిగా సాయిరాం


సాయిరాం నాయక్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం

కొడంగల్, అక్టోబర్ 12 : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన మైండ్ స్పార్క్ టెస్ట్ లో పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిరాం నాయక్ రాష్ట్రస్థాయి ఉత్తమ విద్యార్థిగా ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి మైండ్ స్పార్క్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలరాంనాయక్ మాట్లాడుతూ.. మైండ్ స్పార్క్ టెస్ట్‌ను తెలుగు, గణితం, ఆంగ్ల పాఠ్యాంశాల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. సాయిరాం గరిష్ఠంగా 682 గంటల పాటు ఈ టెస్ట్‌లో పాల్గొనడం ద్వారా మైండ్ స్పార్క్ వారు ఉత్తమ విద్యార్థిగా ఎంపిక చేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ విద్యార్థికి రూ.14వేల ట్యాబ్‌ను బహూకరించినట్లు చెప్పారు. పాఠశాలకు చెందిన మరో 98 మంది విద్యార్థులు 40 గంటల పాటు ప్రశ్నలను పరిశోధించినట్లు పేర్కొన్నారు. వీరికి మైండ్ స్పార్క్‌వారు సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిగా ఉత్తమ విద్యార్థిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# కులవృత్తులకు చేయూత

- లాండ్రీలు, హెయిర్ సెలూన్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- వికారాబాద్ జిల్లాలో 1601 లాండ్రీ, 1064 హెయిర్ సెలూన్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు



వికారాబాద్, అక్టోబర్ 12 : దశాబ్దాల పాటు కుల వృత్తిదారులు వెనుకబడిపోతున్నారు. ఉమ్మడి పాలనలో వారిని గుర్తించి ప్రోత్సహించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఎంతో మంది కులవృత్తులను కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీబ్రాహ్మణులు, రజకుల కులవృత్తులను ప్రోత్సహించింది. లాండ్రీ షాపులు, హెయి ర్ సెలూన్లకు 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడంతో వారికి ఎంతో ఆసరాగా నిలిచింది. వికారాబాద్ జిల్లాలో 1,601 లాండ్రీ షాపులు, 1,064 హెయిర్ సెలూన్లు ఉన్నాయి. వీటిపై వారి కుటుంబాలు ఆ ధారపడి జీవిస్తున్నాయి. గతేడాది నుంచి బీఆర్ఎస్ ప్రభు త్వం 250 యూనిట్ల కరెంట్‌ను వారికి ఉచితంగా అందజేస్తున్నది. వారు విద్యుత్ బిల్లులతో కష్టాలు తొలగిపోయాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కుల వృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం చేసి వారిని ఆర్థికంగా ఆదుకున్నది. ప్రస్తుతం వారికి రాజకీయాల్లో కూడా సముచిత స్థానం కల్పించే అవకాశాలు ఉన్నాయి.


### ప్రోత్సహించడం సంతోషకరం



చాలా ఏండ్లుగా కటింగ్ షాపుపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాం. కుల వృత్తిదారులకు గత ప్రభుత్వాలు ఎలాంటి సాయం చేయలేదు. నెలకు దాదాపు రూ.1000 నుంచి రూ.1200 వరకు విద్యుత్ బిల్లులు వచ్చేవి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడం సంతోషంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

**- నర్సింహులు, కటింగ్ షాపు, వికారాబాద్**

### ఉచిత కరెంట్ అభినందనీయం



ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయడం గొప్ప విషయం. గతంలో విద్యుత్ బిల్లులు దాదాపుగా రూ.2వేల వరకు వచ్చేవి. ప్రతి నెల విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఇబ్బందులకు గురయ్యాం. షాపు అద్దె కూడా పెరగడంతో కుటుంబ అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం మాలాంటి వారికి ఎంతో ఆసరాగా నిలిచింది.

**- సతీశ్, కటింగ్‌షాపు యజమాని, వికారాబాద్**

### ఉచిత విద్యుత్‌తో కష్టాలు తీరాయి



తాతల కాలం నుంచి వస్తున్న కుల వృత్తిని రజకులమైన మేం కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది. ఆర్థికంగా ఎదగలేకపోతున్నాం. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూశాం. ఇటీవల 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడం ఆనందంగా ఉంది. మాలాంటి వారికి ఈ అవకాశం ఎంతో ఉపయోగం. అద్దె భవనంలోనే షాపును కొనసాగిస్తున్నాం.

**- నర్సింహులు, ఐరన్ షాపు, శివరాంనగర్ కాలనీ, వికారాబాద్**

### బొగ్గులు లభించకపోవడంతో..



కుల వృత్తిని నమ్ముకుని ఐరన్ చేస్తున్నా. మాకు సరైన సమయానికి బొగ్గులు సైతం లభించకపోవడంతో వృత్తిని నిలిపివేయాల్సి వస్తున్నది. ప్రస్తుతం అందరూ గ్యాస్ స్టవ్‌పై వంటలు చేయడంతో బొగ్గులు దొరకక ఇబ్బంది పడుతున్నాం. అధిక ధరలకు కొనుగోలు చేసి వృత్తిని కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సీఎం కేసీఆర్ 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంతో కుల వృత్తిని గర్వంగా కాపాడుకుంటున్నాం.

**- లక్ష్మణ్, గరీబ్‌నగర్, వికారాబాద్**

### కుల వృత్తిదారులకు పూర్వ వైభవం



కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న మాలాంటి వారి కోసం సీఎం కేసీఆర్ 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వడం చాలా సంతోషం. ఎన్నో ఏండ్లుగా కుల వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. పెరిగిన అద్దెలు, కరెంట్ బిల్లులతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. కరెంట్ బిల్లులు చూస్తేనే భయపడాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ హయాంలో కుల వృత్తుల వారికి ఆర్థిక చేయూతను ఇవ్వడం అనందంగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

**- ఎం.రమేశ్, జిల్లా అధ్యక్షుడు, నాయీ బ్రాహ్మణ సంఘం, వికారాబాద్**

# తీరొక్క పూలతో బతుకమ్మ సంబురం



కొడంగల్ : జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుక


వికారాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో..

వికారాబాద్, అక్టోబర్ 12 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వికారాబాద్ పట్టణంలో ఆయా పాఠశాలల విద్యార్థినులు బతుకమ్మ సంబురాలను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. బాలికల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలు, సరస్వతీ శిశుమందిర్, న్యూ నాగార్జు తదితర పాఠశాలల్లో చిన్నారులు బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. ముందుగా వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, పూజలు చేశారు. బతుకమ్మ ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. ఆడపడుచులు అంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. చిన్నారులు సైతం బతుకమ్మలను అందంగా పేర్చి పూ జలు చేశారు. అనంతరం సమీపంలోని కొలనులో, నీటి తొట్లలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొడంగల్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలను గురువారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మండలంలోని హస్నాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి, ఆట పాటలతో వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబురాలను జరుపుకొన్నామని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఎంఈవో రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట :** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు శుక్రవారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానుండడంతో ఒకరోజు ముందుగానే బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మలకు పూజలు చేసి వాటి చుట్టూ పాటలు పాడుతూ కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం చెరువులలో బతుకమ్మలను వదిలి పెట్టారు.


కొడంగల్ : హస్నాబాద్ ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలో బతుకమ్మ వేడుక


బొంరాస్‌పేట : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు